విస్తారంగా పుచ్చ సాగు

- గూడూరు నియోజకవర్గంలో పెరిగిన పుచ్చసాగు
- గత ఏడాది లాభాలతో రైతుల్లో ఉత్సాహం

కోట: గత ఏడాది వేసవి సీజన్‌లో పుచ్చకాయలు మంచి ధరలు పలికి రైతులు లాభాలు గడించారు. ఎంతో శ్రమకోర్చి పుచ్చ సాగు చేపట్టిన రైతులు నాలుగు రూపాయలు వెనకేసుకున్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని ఈ ఏడాది కూడా రైతులు పుచ్చ పంట సాగుపై ఆసక్తి కనబరుస్తున్నారు.

విస్తారంగా సాగు

పుచ్చ వేసవికి అనువైన పంట. గూడూరు నియోజకవర్గంలోని గూడూరు, కోట, వాకాడు, చిల్లకూరు మండలాల్లో పుచ్చ సాగుకు అనుకూలమైన ఇసుక, ఎర్రమట్టి నేలలు ఉన్నాయి. గత ఏడాది 700 పైగా ఎకరాల్లో పుచ్చసాగు చేయగా ఈ ఏడాది వెయ్యి ఎకరాలకు మించి సాగు చేస్తున్నట్లు ఉద్యానశాఖ అధికారులు చెబుతున్నారు. పుచ్చపంట సాగు చేసిన తరువాత 60 నుంచి 80 రోజులకు కాయలు చేతికి వస్తాయి. దీన్ని దృష్టిలో ఉంచుకుని రైతులు వేసవి సీజన్‌కు కాయలు కోతకు వచ్చేలా సాగు చేపట్టారు. అయితే డిసెంబర్‌లో కురిసిన భారీ వర్షాలకు కొన్ని చోట్ల పుచ్చ పంట దెబ్బతిన్నది. కానీ రైతులు తిరిగి పంట సాగు చేపట్టారు. పుచ్చసాగులో రైతులు మెళకువలు పాటిస్తున్నారు. రైతులు ఎక్కువగా డ్రిప్ పద్ధతిలో సాగు చేపడుతున్నారు. కలుపు నివారణ, నేల స్వభావాన్ని బట్టి ఎక్కువ మోతాదులో నీటిని అందించి, అధిక దిగుబడులు సాధించే పద్ధతులను అనుసరిస్తున్నారు. ప్రస్తుతం పూత, కాయ మొదలయ్యే సమయం కావడంతో పంట పొలాల్లోనే కాలం గడుపుతూ జాగ్రత్తలు తీసుకుంటున్నారు.



కోట మండలం సిద్ధవరంలో పుచ్చపంట



పుచ్చపంటకు మందుల పిచికారీ

గత ఏడాది లాభాలు

పుచ్చసాగుకు ఎకరాకు రూ.30 వేల నుంచి రూ.50 వేల వరకు ఖర్చు అవుతుంది. పంట పుష్కలంగా వస్తే ఎకరాకు 10 టన్నుల నుంచి 15 టన్నుల వరకు దిగుబడి వస్తుంది. గత ఏడాది వేసవిలో పుచ్చకు మంచి గిరాకీ ఉండడంతో మార్కెట్‌లో టన్ను రూ.17 వేల నుంచి రూ.18 వేల వరకు పలికింది.దీంతో రైతుకు ఎకరాకు రూ. 1,70,000 నుంచి రూ.2,50,000 వరకు చేతికి అందింది. పెట్టుబడులు పోను ఎకరాకు రూ.లక్ష నుంచి గరిష్టంగా రూ.2 లక్షల వరకు ఆదాయం వచ్చింది. గత వేసవిని దృష్టిలో ఉంచుకుని ఈ ఏడాది కూడా రైతులు ఉత్సాహంగా పుచ్చసాగు చేపట్టారు.

మూడేళ్లుగా మంచి లాభాలు



పుచ్చ సాగులో మెళకువలు పాటించాలి. పూత దశ నుంచి కాయలు పక్వానికి వచ్చే వరకు తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నాం. కాబట్టి గత మూడేళ్లుగా పుచ్చసాగులో లాభాలు పొందుతున్నాను. వాతావరణ పరిస్థితులు సహకరించాయి. ధరలు కూడా ఆశాజనకంగా ఉన్నాయి. దీంతో ఈ ఏడాది తొమ్మిది ఎకరాల్లో పుచ్చ సాగు చేపడుతున్నాను.

- శివానందం, రైతు, ఇలకూరుపాడు, కోట మండలం

రైతులు మెళకువలు పాటించాలి

పుచ్చ సాగు చేపడుతున్న రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలి. నేల స్వభావాన్ని బట్టి విత్తనం నాటినప్పటి నుంచి నీటిని అందించాలి. పూత, పిందె దశలో సాగు నీటికి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలి. కాయలు పక్వానికి వచ్చే దశలో నీటిని తగ్గించాలి. ఈ సమయంలో నీటిని ఎక్కువగా అందిస్తే కాయ పగిలే అవకాశం ఉంది. మల్చింగ్ సాగు చేపట్టే పుచ్చ రైతులకు ఎకరాకు రూ.6400 వరకు ప్రభుత్వం రాయితీ ఇస్తుంది.

- కార్తీక్, ఉద్యానశాఖ అధికారి, గూడూరు

క్లుప్తంగా

సాయినాథునికి ప్రత్యేక పూజలు

ఓజిలి: రథసప్తమి సందర్భంగా మానమాల గ్రామంలోని సాయిబాబా మందిరంలో భక్తులు సాయినాథునికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం కాగడ హారతితో పూజలు ప్రారంభించారు. ఆలయ నిర్మాణకర్తలు ఉచ్చూరు శోభారాణి, హరినాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో పండితులు మందిర ఉభయకర్తల శాశ్వత గోత్రనామాలతో బాబాకు క్షీరాభిషేకం చేపట్టారు. మధ్యాహ్నం హారతులు పట్టారు. రాత్రి భజనగీతాలు ఆలపించి, పల్లకీ సేవ చేపట్టారు. ఆలయ నిర్మాణ కర్తలు భక్తులకు తీర్థప్రసాదాలను పంచిపెట్టారు.

గృహ నిర్మాణ పనులు వేగవంతం

సైదాపురం: గృహ నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని హౌసింగ్ ఈఈ మోహన్‌రావు కోరారు. మండలంలోని రామసాగరంలోని లేఅవుట్లను పరిశీలించారు. అనంతరం మండల కేంద్రమైన సైదాపురంలో ఎంపీడీఓ శివకుమార్ అధ్యక్షతన మండల స్థాయి అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి 31వ తేదీ లోపల నిర్మాణ పనులన్నీ పూర్తి చేయాలని కోరారు. నిర్మాణ పనులు పూర్తి చేసిన లబ్ధిదారులకు వెంటనే వారి ఖాతాల్లోకి నిధులను జమ చేస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వ సహకారంలో రాష్ట్ర ప్రభుత్వం 2.0 స్కీంకు అర్హులైన లబ్ధిదారులు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు.

సీసీ రోడ్లు నిర్మాణంపై ఏపీడీ విచారణ

పెళ్లకూరు: మండలంలోని శిరసనంబేడు గ్రామంలో జరిగిన సిమెంట్ రోడ్డు నిర్మాణాలపై డ్వామా ఏపీడీ వరప్రసాద్‌రావు మంగళవారం విచారణ చేపట్టారు. గ్రామంలో చేపట్టిన సిమెంట్ రోడ్డు పనులకు సంబంధించి జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండల పరిషత్ కార్యాలయంలో విచారణ చేపట్టి, ఆ శాఖ పీడీకి నివేదించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రమీలారాణి, ఏపీఓ దయానంద్ పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టం నిర్వీర్యం

నాయుడుపేట టౌన్: జిల్లా పరిధిలోని పలు శాఖల అధికారులు సమాచార హక్కు చట్టంపై 'దరఖాస్తు దారులకు పూర్తి వివరాలు ఇవ్వకుండా నిర్వీర్యం చేస్తున్నారని సమాచార హక్కు ప్రచార సమితి రాష్ట్ర అర్గనైజర్ ఎదళ్ల సుబ్రహ్మణ్యంరెడ్డి వెల్లడించారు. నాయుడుపేట పట్టణంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు తీగల భాస్కర్, సభ్యులతో మంగళవారం సాయంత్రం సమావేశం జరిపారు. సమాచార హక్కు చట్టంపై వివరాలను తెలుసుకుని అధికారులను నిలదీస్తామన్నారు. చెంగల్రాయులు, సభ్యులు భాస్కర్, రామయ్య, చిరంజీవి, ముజీబ్, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

వెంకటగిరి(సైదాపురం): కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు కూటమి ప్రభుత్వం ఉద్యోగ భద్రత కల్పించాలని కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ తిరుపతి జిల్లా అధ్యక్షుడు షేక్ కరిముల్లా కోరారు. వెంకటగిరి పట్టణంలోని ఐఐహెచ్‌టీ కళాశాలలో మంగళవారం కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ క్యాలెండర్లను ఆవిష్కరించారు.

గడ్డి లారీ ఆర్టీసీ బస్సు ఢీ

చిట్టమూరు: నాయుడుపేట-మల్లాం రహదారిపై మండల పరిధిలోని కొత్తగుంట గ్రామ కూడలి వద్ద బుధవారం గడ్డిలోడుతో వెళ్తున్న లారీ, ఆర్టీసీ బస్సు ఢీ కొనడంతో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. సూళ్లూరుపేట నుంచి కోటకు వెళ్తున్న బస్సు, మల్లాం వైపు నుంచి నాయుడుపేటకు వెళ్తున్న గడ్డి లారీ ఢీ కొనడంతో బస్సు ముందు భాగం దెబ్బతినింది. దీంతో ఇద్దరు డ్రైవర్లు వాగ్వాదానికి దిగడంతో వాహనాల రాకపోకలు ఆగిపోయాయి. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

కొలతల మేరకు పనిచేయాలి

దక్కిలి: జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పనుల కూలీలు మూడున్నర మీటర్ల కొలత తగ్గకుండా పని చేస్తేనే కనీస గిట్టుబాటు కూలీ నగదు లభిస్తుందని ఎంపీడీఓ టి.గుణశేఖర్ రెడ్డి తెలియజేశారు. మండలంలోని సంగనపల్లి గ్రామంలో ఉపాధి హామీ పథకం కింద పని చేసే కూలీలకు తక్కువ నగదు వస్తుందని, కొందరికైతే రూ.50 కూడా వస్తోందని కూలీలు ఎంపీడీఓకి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మంగళవారం ఎంపీడీఓ గ్రామానికి చేరుకుని కూలీలతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ కూలి పనులకు వెళ్లే కూలీలు ప్రతి రోజు కొలతల ప్రకారం పనులు చేస్తేనే రూ.300 గిట్టుబాటు కూలీ అందుతుందన్నారు. కొలత ప్రకారం పనులు చేయకుండా గంట, అరగంట సేపు పని చేస్తే మాత్రం గిట్టుబాటు కూలీ రాదన్నారు. దీంతో స్పందించిన ఎంపీడీఓ ఇక మీదట తప్పుడు మస్టర్లు వేస్తే మాత్రం చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట టెక్నికల్ అసిస్టెంట్ సరిత, సిబ్బంది ఉన్నారు. అనంతరం సంగనపల్లి సచివాలయాన్ని ఆయన సందర్శించారు. సచివాలయ సిబ్బంది ప్రతి రోజూ విధిగా విధులకు హాజరు కావలన్నారు.

విద్యార్థుల యోగా సాధన



సూర్య నమస్కారాలు సాధన చేస్తున్న విద్యార్థులు

కోట: విద్యానగర్ ఎన్‌బీకేఆర్ కళాశాలలో మంగళవారం రథసప్తమి సందర్భంగా యోగా క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులతో యోగ, సూర్య నమస్కారాలు సాధన చేయించారు. విద్యార్థులు యోగ సాధనతో ఒత్తిడిని జయించవచ్చని ప్రొఫెసర్ హరనాథరెడ్డి సూచించారు. యోగక్లబ్‌లో ఉత్తమ ప్రదర్శన కనబరిచిన విద్యార్థిని సాహిత్యకు జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో పీడీ మల్లికార్జునరెడ్డి, శోభారాణి, రాము పాల్గొన్నారు.

బీసీ సబ్సిడీ రుణాలను వినియోగించుకోండి

వెంకటగిరి రూరల్: ఆర్థికంగా వెనుక బడిన వారికి బీసీ కార్పొరేషన్ అందిస్తున్న సబ్సిడీ రుణాలు దరఖాస్తు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ కోటేశ్వరరావు మంగళవారం వేర్వేరు ప్రకటనల్లో తెలియజేశారు. పట్టణ, రూరల్ పరిధిలో ఉన్న బీసీ కుల ధ్రువీకరణ సర్టిఫికెట్, పుట్టిన సర్టిఫికెట్, రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, బ్యాంక్ పాసుపుస్తం, పాస్‌పోర్టు సైజ్ ఫొటోతో ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలన్నారు. ఇందుకు సంబంధించి ఈ నెల 7వ తేదీ వరకు చివరి గడువు ఉందని, లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు.

నేడు సర్వసభ్య సమావేశం

ఓజిలి: మండల అభివృద్ధి కార్యాలయంలో ఎంపీపీ గడ్డం అరుణారెడ్డి ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ విజయలక్ష్మి మంగళవారం తెలిపారు. ఈ మండల సమావేశానికి అధికారులు, ప్రజాప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొనాలని కోరారు.

రుణాలను వెంటనే చెల్లించండి

సైదాపురం: సైదాపురం సొసైటీ ద్వారా తీసుకున్న రుణాలను వెంటనే చెల్లించాలని గూడూరు డివిజన్ కేంద్ర సహకార సంఘం బ్యాంకు మేనేజర్ సత్యవతి కోరారు. మండల కేంద్రమైన సైదాపురం సొసైటీ కార్యాలయాన్ని మంగళవారం ఆమె ఆకస్మికంగా తనిఖీలు చేశా రు. అనంతర రికార్డులను పరిశీలించారు. ఈ క్రమంలో భాగంగా రుణాల రికవరీలో భాగంగా బ్యాంకును పరిశీలించినట్లు ఆమె తెలిపారు. సైదాపురం సొసైటీ ద్వారా సుమారు రూ.20 కోట్ల మేర వివిధ రకాలైన రుణాలను రైతులకు అందజేసినట్లు ఆమె చెప్పారు. ఆమె వెంట సూపర్‌వైజర్, సీఈఓ శ్రీనివాసులున్నారు.

కిలివేటి పరామర్శ



పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కిలివేటి

సంజీవయ్య సుబ్బారావుకు మాజీ ఎమ్మెల్యే పరామర్శ

చిట్టమూరు: దరఖాస్తు గ్రామానికి చెందిన సీనియర్ జర్నలిస్టు అద్దూరు రవి తల్లి మంగళవారం చనిపోయింది. విషయం తెలుసుకున్న సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అద్దూరు రవి కుటుంబాన్ని పరామర్శించారు. దరఖాస్తు గ్రామానికి వెళ్లి మృతురాలు రమణమ్మ పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వైఎస్ఆర్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు తంబిరెడ్డి సుబ్రమణ్యం రెడ్డి, నాయుడుపేట పట్టణ అధ్యక్షుడు కలికి మాదవరెడ్డి, ఓజిలి అధ్యక్షుడు పాదర్తి హరినాథ్‌రెడ్డి, నాయకులు దేశిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, గంధవల్లి సిద్దయ్య, షబ్బీర్, పరంగి ప్రసాద్ పాల్గొన్నారు.

ఓజిలిలో..

ఓజిలి: ఓజిలి గ్రామానికి చెందిన వైఎస్ఆర్ సీపీ సీనియర్ నాయకుడు ముమ్మడి సుబ్బారావు యాదవ్‌ను మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య మంగళవారం పరామర్శించారు. సుబ్బారావు గత కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధ పడుతూ ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నాడు. విషయం తెలుసుకున్న సంజీవయ్య పరామర్శించి ఆరోగ్య విషయాలు తెలుసుకున్నాడు. ఆయన వెంట మండల కన్వీనర్ పాదర్తి హరనాథ్‌రెడ్డి, మాజీ మండల కన్వీనర్ దేశిరెడ్డి మధుసూదన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఆక్రమణలపై నామమాత్రపు సర్వే



మామిడి కాలువ వద్ద అధికారుల సర్వే

నాయుడుపేట టౌన్: మేనకూరు గ్రామంలో మామిడి కాలువ ఆక్రమణలపై మంగళవారం రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు చేపట్టిన సర్వే నామమాత్రంగా సాగిందని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మామిడి కాలువను దర్జాగా ఆక్రమించిన తీరుపై సాక్షి దినపత్రికలో దర్జాగా కబ్జా పేరుతో వచ్చిన కథనంతో పాటు గ్రామస్తుల ఫిర్యాదుపై అధికారులు స్పందించారు. మామిడి కాలువలో పెద్ద ఎత్తున మట్టి తరలింపు చేపట్టి ఆక్రమించిన స్థలాన్ని మంగళవారం పరిశీలించారు. మండల సర్వేయర్ చరణ్, ఆర్ఐ సాయి తేజ, ఇరిగేషన్ డీఈ వీరాస్వామి, మామడి కాలువకు సంబ ంధించిన ఏఈ శ్రీనివాసులు, వీఆర్‌ఓ శ్రీనివాసులు తదితర అధికారులు మామిడి కాలువ వద్దకు చేరుకున్నారు. కొంత మంది గ్రామస్తులు కూడా వచ్చారు. మామిడి కాలువ పొడవు, వెడల్పు సర్వే చేయకుండా కేవలం ఆక్రమణదారుల పట్టాను అనుసరించి కొలతలు తీయడంపై గ్రామస్తులు ఆక్షేపించారు. దీంతో పాత రికార్డుల ప్రకారం మామిడి కాలువ కొలతలు తీస్తామని చెప్పి అధికారులు వెళ్లి పోయారు. ఆక్రమణలను పరిశీలించిన వారిలో సూళ్లూరుపేట డీఎల్‌పీఓ రవీంద్ర, ఈఓపీఆర్‌డీ గోపాల్, మేనకూరు సర్పంచ్ సురేష్, కార్యదర్శి అశోక్‌కుమార్ తదితరులు ఉన్నారు.

సప్త వాహనాలపై లక్ష్మీనరసింహుడు

- గోవిందనామ స్మరణతో మార్మోగిన పెంచలకోన
- కోనలో వైభవంగా రథసప్తమి వేడుకలు



బంగారు గరుడ వాహనంపై స్వామివారు

రాపూరు: మండలంలోని ప్రముఖ పుణ్య క్షేత్రమైన పెంచలకోనలో స్వయంభువుగా వెలసియున్న శ్రీపెనుశిల లక్ష్మీ నరసింహస్వామి మంగళవారం రథసప్తమి పర్వదినాన్ని పురస్కరించుకుని ఏడు వాహనాలపై ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. రథసప్తమి పర్వదినాన్ని పురస్కరించుకు శ్రీలక్ష్మీ నరసింహస్వామికి ఉదయం 4గంటలకు అభిషేకం నిర్వహించారు. 6 గంటలకు సూర్యప్రభ వాహనం, 8గంటలకు శేషవాహనం, 10 గంటలకు సింహ వాహనం, 12 గంటలకు స్వర్ణ గరుడ వాహనంపై వేడుకగా ఊరేగించారు. మధ్యాహ్నం 2 గంటలకు పుష్కరిణిలో సుదర్శన చక్రానికి పాలు, తేనె, పసుపు, చందనం, కొబ్బరినీరు, పెరుగు, నెయ్యి, వివిధ రకాల సుగంధ ద్రవ్యాలు, పండ్లు పుష్పాలతో అభిషేకం నిర్వహించారు. అనంతరం పుష్కరిణిలో చక్రస్నానం చేయించారు. తిరిగి సాయంత్రం 4గంటలకు బంగారు హనుమంత వాహనం, సాయంత్రం 6గంటలకు అశ్వ వాహనం, రాత్రి 8 గంటలకు చంద్ర ప్రభవాహనంపై కోన మాడవీధుల్లో క్షేత్రోత్సవం నిర్వహించారు. ఈ ఊరేగింపులతో పెంచలకోన క్షేత్రం గోవింద నామస్మరణలతో మార్మోగింది.

అమ్మవారి హుండీ ఆదాయంరూ.53.23 లక్షలు

సూళ్లూరుపేట రూరల్: శ్రీచెంగాళమ్మ పరమేశ్వరి ఆలయంలో అమ్మవారి హుండీలను దేవదాయశాఖ వాధ్వర్యంలో మంగళవారం లెక్కించారు. 105 రోజులకు రూ.53,23,998 అమ్మవారి హుండీ ఆదాయం వచ్చిందని దేవదాయ శాఖ సహాయ కమిషనర్, ఈఓ ప్రసన్న లక్ష్మి తెలిపారు. ఇందులో యూఎస్ డాలర్స్ 31, సింగపూర్ డాలర్స్ 4, సౌదీ రియాల్స్ 50, యూఏఈ దిర్హమ్స్ 5, ఇంగ్లాండ్ పౌండ్స్ 10, మలేషియా రింగెట్స్ 12, ఆస్ట్రేలియన్ డాలర్స్ 50, టీపీఏ హుండ్రా క్రోనోర్ 200, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఒమన్ 1 విదేశీ కరెన్సీ లభించిందన్నారు. ఈ కార్యక్రమంలో దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస బాబు, రెవెన్యూ, బ్యాంక్ సిబ్బంది, మెప్మా సభ్యులు పాల్గొన్నారు.

జాబ్ మేళాలో 37 మంది ఎంపిక



నియామక ఉత్తర్వులతో ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులు

సూళ్లూరుపేట రూరల్: ఎస్వీఎస్ఎస్‌సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వివిధ రకాల కంపెనీలు మంగళవారం నిర్వహించిన జాబ్ మేళాలో 37 మంది అభ్యర్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారని ఆ కళాశాల వైస్ ప్రిన్స్‌పల్ డాక్టర్ విక్టోరియా రాణి తెలిపారు. వీల్స్ ఇండియా లిమిటెడ్, హెచ్‌డీబీ ఫైనాన్షియల్ సర్వీసెస్, గ్రీన్ టెక్, సీసీఎల్ కాఫీ, టీవీఎస్, బ్లూ స్టార్ ఏసీ, కోకోకోలా ఎఫ్ఎంసీజీ కంపెనీలు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా నిర్వహించాయి. 72 మంది విద్యార్థులు హాజరయ్యారని ఆమె తెలిపారు. ఇందులో 37 మంది అభ్యర్థులకు నియామక పత్రాలను అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో జేకేసీ కోఆర్డినేటర్ సుబ్రమణ్యం శాస్త్రి, ప్రసాద్, ఏపీ స్కిల్ డెవలమెంట్ కోఆర్డినేటర్ హరికృష్ణ, సునీల్, కంపెనీల హెచ్‌ఆర్‌లు పాల్గొన్నారు.

మున్సిపాలిటీ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

నాయుడుపేట టౌన్: మున్సిపాలిటీ అభివృద్ధితో పాటు ఆదాయ వనరులపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు కమిషనర్ షేక్ ఫజులుల్లా పేర్కొన్నారు. మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అద్దె చెల్లించని మున్సిపాలిటీ దుకాణాలకు తాళాలు వేస్తున్నట్లు వెల్లడించారు. తిరిగి వేలం పాట నిర్వహించి, దుకాణాలను ఇతరులకు ఇస్తామన్నారు. అక్రమంగా 3500కు పైగా నీటి కొళాయి కనెక్షన్‌లు ఉన్నట్లు గుర్తించామన్నారు. వీరందరికి నోటీసులు అందిస్తామని, మున్సిపాలిటీకి రుసుము చెల్లించి, అధికారికంగా గుర్తింపు పొందాలన్నారు. అనుమతులు పొందకుండా నిర్మిస్తున్న భవనాలపై కూడా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

పారిశుధ్య పనులపై దృష్టి సారించాలి



మేనకూరులో పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ రవీంద్ర తదితరులు

నాయుడుపేట టౌన్: సూళ్లూరుపేట డివిజన్ పరిధిలో గ్రామ పంచాయతీలలో పారిశుధ్యంపై కార్యదర్శులు, గ్రామ సచివాలయ సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలని డీఎల్‌పీఓ రవీంద్ర సూచించారు. మండల పరిధిలోని మేనకూరు గ్రామంలో మంగళవారం పలు ప్రాంతాల్లో పారిశుధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ గ్రామ సర్పంచ్‌లు, ఇతర ప్రజాప్రతినిధుల సహకారంతో అభివృద్ధి పనులు చేసుకోవాలని డీఎల్‌పీఓ సూచించారు. ఈఓపీఆర్‌డీ మల్లు గోపాల్, కార్యదర్శి అశోక్ కుమార్ తదితరులు ఉన్నారు.

బాలాయపల్లి(సైదాపురం): మండలంలోని అన్నీ గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టేలా ఆయా పంచాయతీల కార్యదర్శులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని ఎంపీడీఓ వినీల్‌కుమార్ సూచించారు. బాలాయపల్లిలోని మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు.చెత్తాచెదారాలు, వ్యర్థాలు, మురుగు నిల్వ లేకుండా పారిశుధ్య పనులు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఈఓపీఆర్డీ మోహన్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

సిలికా మైన్ కోసం సంయుక్త సర్వే

చిల్లకూరు: తీర ప్రాంతంలోని బల్లవోలు గ్రామంలో సిలికా మైన్ కోసం కోర్టు ఉత్తర్వులు మేరకు రెవెన్యూ, గనుల శాఖాధికారులు మంగళవారం సర్వే చేపట్టారు. ఆ భూముల్లో సాగు చేస్తున్న రైతులు అక్కడికి చేరుకుని పేదలకు పంపిణీ చేసిన భూముల్లో మైన్ ఎలా కేటాయిస్తారని నిలదీశారు. బల్లవోలు పేదలకు ప్రభుత్వం ద్వారా సుమారు 40 ఎకరాల వరకు పంపిణీ చేసింది. నెల్లూరు ప్రాంతానికి చెందిన ఒకరు ఆ భూములు ఖాళీగా ఉన్నాయని సిలికా మైన్ కోసం దరఖాస్తు చేసుకోగా వాటిని కేటాయించారు. అనేక వివాదాల అనంతరం లీజు పొందిన యజమాని ఆ భూములు ఇప్పటికీ ఖాళీగా ఉన్నాయని కోర్టును ఆశ్రయించడంతో గనులు, రెవెన్యూ శాఖల అధికారులు సంయుక్తంగా సర్వే చేసి నివేదికలు ఇవ్వాలని కోర్టు ఆదేశించింది. నివేదికలను నాలుగు రోజుల్లో కోర్టుకు అందిస్తామని అధికారులు తెలిపారు. తహసిల్దార్ శ్రీనివాసులు, గనుల శాఖ ఏడీ శ్రీనివాసరావు, ఆర్ఐ పూర్ణ, సర్వేయర్ మల్లికార్జున్ పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నివారణపై ర్యాలీ

నాయుడుపేట టౌన్: క్యాన్సర్‌కు ప్రధాన కారణంగా ఉన్న ప్లాస్టిక్‌ను వినియోగించవద్దని విద్యార్థులు మంగళవారం ర్యాలీ చేపట్టారు. ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా సరస్వతి మహా విద్యాలయ పాఠశాల కరస్పాండెంట్ తోట విజయప్రియ ఆధ్వర్యంలో ఉపాధ్యాయినులు, విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. పలు కూడళ్ల వద్ద క్యాన్సర్ మహమ్మారిపై ప్రతి ఒక్కరు అవగాహన పెంచుకోవాలని ప్లకార్డులను ప్రదర్శించారు.

తైక్వాండోలో సత్తా చాటిన క్రీడాకారులు



తైక్వాండో క్రీడాకారులను అభినందిస్తున్న అతిథులు

నాయుడుపేట టౌన్: తైక్వాండో రాష్ట్ర స్థాయి పోటీల్లో నాయుడుపేట క్రీడాకారులు పతకాలను సాధించినట్లు కోచ్, స్థానిక తైక్వాండో క్లబ్ వ్యవస్థాపకుడు పవన్‌కుమార్ మంగళవారం తెలిపారు. కాకినాడలో రాష్ట్ర తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎన్‌టీఆర్ మెమోరియల్ పేరుతో పోటీలు జరిగినట్లు తెలిపారు. ఈ పోటీల్లో నాయుడుపేటకు చెందిన 32 మంది క్రీడాకారులు పాల్గొన్నట్లు వెల్లడించారు. నాయుడుపేట క్రీడాకారులు 15 బంగారు, 6 వెండి, 4 బ్రాంజ్ మెడల్స్ సాధించినట్లు కోచ్ తెలిపారు.